నిరుత్సాహపడకు

శ్రీమతి బి. స్వరాజ్యం

" సాయంత్రం మూడుగంటల సమయం. కల్పనాదత్తు ఆత్మ కథ చదువుతూ కూర్చున్నా " ..యింతలోనే మా చెల్లె... " అక్కయ్యా, విమలమ్మ వచ్చిందని గభాలున పరుగెత్తుక వచ్చింది ". కాని, నేను నమ్మలేకపోయా; " విమల నాకు పూర్వస్నేహితురాలు. ఎప్పుడో కాపరానికి వెళ్లకముందు, మే మిద్దరం అన్యోన్యంగా వుండేవాళ్లం. ఆమె ఒక ధనికయింటి కోడలు. కాపరానికి వెళ్లి రెండు సంవత్సరాలనుంచీ కన్పించలే ... పాపం చూడాలనిపించిందేమో వచ్చిందనుకొన్నా. నాకు చాలా సంతోష మనిపించింది......

యేం విమలా ? బాగున్నావా ? అన్నా. తానుకూడా చాలా రోజులకు తన ప్రియమైన స్నేహితురాల్ని కలుసుకున్నానని కాబోలు, చేతికిచేయి అందించింది. కానీ ఆమె ముఖాన సంతోషం వెల్లివిరిసింది..." యేమిటి విమలా ? క్షేమ సమాచారాలు. అమ్మావాళ్లూ బాగా వున్నారా ? " అని అడిగా.

" అమ్మావాళ్ల క్షేమం నా కెందుకు. యీ భాగ్యజీవిని నేను మాత్రం బ్రతికేవున్నా " అంది విమల.

ఆమె కళావిహీనమగు మొఖము. ఆమె జీవితంపై విసుగెత్తి మాట్లాడే మాటలు. దీనమైన కంఠస్వరం చూచి నాకు చాలా జాలివేసింది. బాధనిపించిందికూడా ; ఈమె బాధేమిటో తెలుసుకోవాలనుకొన్నా. చేయిపట్టుకొని మాట్లాడుతూ యింట్లో కొచ్చాము. " అమ్మా, నా స్నేహితురాలు విమల వచ్చిందే " అన్నా.

" కూచో బిడ్డా " అని పీటేసె గౌరవించింది అమ్మ.

" విమలమ్మకయ్యేకు పలహారము చేసి పెడదామే అంది " చెల్లె.

"మన కేముంది బిడ్డా. మనం బీదవాళ్లం. ఆమె ధనికయింటి కోడలు. మంచి మంచి పలహారములు మనకు లేవు కదా " అంది అమ్మ.

" దోచుకతినేవాళ్లకు దొడ్డదొడ్డ పలహారాలు. అటువంటి వాళ్లుండగా, మనలాంటి బీదవాళ్లకు బ్రతుకువేర వుందా ? ప్రజల కెన్నికష్టాలు పెట్టుటలే దీ దుండగీంద్రు " ఏదో వున్నది పెడదామన్నా.

" మళ్లీ విమలకు కోపమొస్తుందేమో నని మొఖము కేసి చూశా. కాని, విమలముఖంలో ఏ మాత్రం మార్పు కనిపించలే...విచారంగా చూస్తూ నిలుచుంది.

" ఎందుకు రాధా ఆలా అంటావూ " అంది అమ్మ.

" ఏంది మామ్మా. ఆ విధంగా అనకు. నిజంగా ధనికులు నికృష్టులు, కఠినులు, కనికరమనేది యే కోశానా వుండదు. ఎంతటి నీచానికైనా వెరవరు. ప్రజల్ని అతిఘోరంగా దోచుకొంటారు......

" నిజం రాధా. నిజం చెప్పావు " అంది విమల.

" నా కాశ్చర్య మనిపించింది. అసలు సంగతేమిటో తెలుసుకోవాలనే పట్టుదల కలిగింది విమలను సంతోషపెట్టాలని "

" స్వాతంత్ర్యము స్వేచ్ఛయు కాంతీ,
యీ జగతి లేదా స్త్రీలకూ. "

అనే పాటపాడాను, " విమల చటుక్కున నా ముఖం

సంబంధాలు సమానస్థాయిలో లేకుంటే వచ్చే అనర్థాలు

వైపు చూస్తూ" నిజమే రాధా. యీ సమాజంలో నా కేదైన దారిచూపవూ అంది.

"విమలా! ఎందుకమ్మా నీ కింత బాధ?

"నా తలిదండ్రులు దరిద్రులైనా, నన్ను ధనికుల కిచ్చి గొంతుకోశారు."

అల్లా అంటావు విమలా? "తల్లిదండ్రులు దరిద్రులైనా ధనికుని యింట్లో పడ్డదని, సుఖపడుతుందని, అదృష్టమని, సమాజంలో మన అమ్మలంతా ముచ్చటలాడుకుంటుంటే, ఒకొక్కప్పుడు మా అమ్మకూడా నా బిడ్డకు సుఖములేదాయెనని చింతించుతుంది. కాని, మేము దాన్ని సహించం; "వ్యతిరేకించుతాం. వాళ్లేవిధంగా దుర్మార్గాలు చేస్తారో, మా అమ్మకే కాకుండా స్త్రీ లందరికీ నచ్చచెపుతాం."

ఈ సమాజమా, పాడు సమాజం? "యింకెన్ని తరాల నీ విధంగా నాశనంచేయ దలచుకుందో, ఎన్ని అనుభవాలను గడించినా, యీ సమాజాని కెందుకు బుద్ధిరాదో" "ఈ సనాతనిష్టులు బుద్ధిపూర్వకంగా బాలికల గొంతులు కోస్తారు."

"నా జీవితం చూడు రాధా. యే విధంగా పాడైపోయిందో? "యింట్లో అత్త సెగలనివ్వదు. ఆడబిడ్డ అంతకంటె భష్టులి. దాసీదానికంటే నీచంగా చూస్తారు. గౌరవమనేది పాడైపోయింది. యిక భర్త సంగతి చూచుకుంటే భావి జీవితమే లేదనిపిస్తుంది. నన్ను మూడవ సంబంధ మిచ్చారు. నా కేమాత్రం యిష్టం లేకుండె కాని, యీ సమాజం నా భావాలను చెప్పుకోకుండా నోటికి తాళం వేసింది. దురాగతాలకు లోనై మా తల్లిదండ్రులు నన్నీ బాధలకు గురిచేశారు. బీద కుటుంబంనుంచి వచ్చానని, అత్తా, ఆడబిడ్డా యెత్తిపొడుస్తారు. భోగం మేళాలతో కాలం గడుపుతుంటా డతడు. యిక నా మాట తలచేవారెవరా కుటుంబాన? అబ్బా భరించరాని బాధలు. ఏం చెప్పను? యేమి తోచదు. ఆత్మహత్యే అంతిమమార్గ మనిపించుతుంది."ఇవన్నీ వినేసరికి నా హృదయం బరువెక్కిపోయింది అబ్బా యీ సమాజంలో యెంత కుళ్లువుంది? "యిటువంటి అభాగ్య జీవులు యెందరు మానవత్వాన్నే చంపుకొని సమాజ కట్టుబాట్లకు లోనై, బాధ లనుభవిస్తున్నారు." దీనికి మార్గమేదైనా వుందా? అనే ఆలోచనలో పడ్డా. యేదైనా... విమలను వోదార్చడమే ప్రస్తుత కర్తవ్యమనుకున్నా. విమలా మా తోటవద్దకు పోదాము; పద అన్నా.

"నా మాట వినగానే సంతోషిస్తూ నా ముఖంకేసి చూడసాగింది." యేమిటా? అనే ఆలోచనలో పడ్డా. యింతలోకే అమ్మ గ్రహించింది. "యేంటే రాధా? ఆమె ధనికయింటి కోడలు గదా, ఘోషాను వదలుకొని తోటకు రావడం అగౌరవం కాదా?" అంది.

యిది వినగానే ఎంతో వుద్రేకంతో నాకు పెద్ద వుపన్యాసం వొచ్చింది. "ఏంటే అమ్మా? యింకెన్నాళ్లు నాలుగు గోడలమధ్య బంధించబడి కప్పవలె పరదాలచాటునే పాలిపొమ్మంటున్నావు? మీకు మల్లేనే దుష్టాచారాల కట్టుబాట్లతో ప్రకృతి సౌందర్యాన్నికూడా చూడ వీలులేకుండా వుండడం గౌరవమేనా?"

"ప్రజలను దోపిడిచేసే యీ ధనిక కుటుంబాలకు గౌరవ గౌరవాలు, న్యాయాన్యాలు అర్థంకావు; చెవికెక్కవు. ముక్కుపచ్చ లారని పసిబిడ్డలను వివాహమాడి, అనుమానాలతో ఘోషాపద్ధతి పెట్టి, తమచేతిలో దిష్టిబొమ్మల్లాగా, తయారుచేసుకోవడానికి, స్త్రీలు చదువకూడదని నిషేధాలు సృష్టించి, స్త్రీలను నిర్జీవులుగా తయారు చేశారు. యీ మోసాన్నెరుగక వీరినే గౌరవనీయులుగా భావించుకొనే అమాయక బీదకుటుంబాలు పై ఆచారాలననుసరించి, నానా విధాల అవస్థలుపడ్డారు. నిజంగా ఆలోచించితే యిది గౌరవమనబడదు; ప్రతి స్త్రీ, పురుషుని మనస్సులను వికసింపజేసి, హృదయాలకు స్వేచ్ఛనిచ్చి దోపిడిచేసే పద్ధతిపోయి, అందరిని సమానంగా విజ్ఞానవంతులను చేయడమే గౌరవము; ఆదర్శము."

అమ్మా? యికనైనా యీ మోసాన్ని గ్రహించడం మంచిది.

యిదంతా విన్న విమలకండ్లు జ్యోతులై మెరిసాయి. ఆవేశంతో మొఖము ఎర్రనైంది. ఆలోచనతో రాధా? యింతవిజ్ఞానా న్నెలా సంపాదించావమ్మా? నేను, నీవు ఒక్క బళ్లో చదువుకున్నాము కదా... అంది.

నిరుత్సాహపడకు

విమలా ? స్కూల్లో చదువుకున్న విజ్ఞానము కాదమ్మా. " మన స్కూళ్లల్లో సరియైనవిజ్ఞానం బోధించరు. అందులో స్త్రీలను మరీ తక్కువగా చూస్తారు. మన కీలాంటి విజ్ఞానం బోధించరు. యేదో పిట్టకధలు చెప్పి, కాలం వెళ్లబుచ్చుతారు. "

" మరేలా సాధించావు రాధా ? నీతో స్నేహంగావుండటానిక్కూడా వీలులేకుండా చేశారు నా తల్లిదండ్రులు. ప్రపంచంతో సంబంధం లేకుండా నా కాళ్లు కట్టివేశారు. యీ బాధ లెన్నటికైనాపోతవా ? మార్గమేదైనా వుందా ? "

" విమలా భయపడకు; నీవేకాదు యీ బాధ లనుభవించేది. యింకెందరో వున్నారు. యీ సమాజంలో మార్పు రానంతవరకు యీ బాధలు పోవు. మార్గము లేకపోలేదు, ఉంది ఆలోచిస్తే, ధైర్యంచేస్తే మార్గం లేకపోలేదు. మన కొక సంఘముంది. మనవలె బాధ లనుభవించినవారే మంచి మార్గ మాలోచించి, సమాజ మార్పులకొరకు పాటుబడుతున్నారు. నన్నా సంఘమే అభివృద్ధి చేసింది. మనంకూడా శక్తివంచన లేకుండా పాటుపడాలి. ముందుముందొచ్చే భావిపౌరులైనా, సుఖజీవనం గడిపేలా చూడాలి. "

" నిజమే రాధా; ముందొచ్చేవాళ్లకైనా యీ బాధలు లేకుండాపోతే బాగుండుననిపిస్తుంది " రాధా; నీవు నాకు చాలా సహాయపడాలి. నన్నుకూడా స్త్రీలహక్కుల కొరకు పాటుపడేలా చేయాలి.

" ఫరవాలేదు విమలా; అవకాశ మున్నంతవరకు సహాయపడుతా. అందుకేమీ సందేహంలేదు. " " నిరుత్సాహపడకు ".

★

ఆంధ్ర మహిళా సభ

మైలాపూరు : : మద్రాసు.

మహిళాభ్యున్నతి పరమాశయముగా గల ఆదర్శ సంస్థ

మహిళా విద్యాలయము :	తెలుగు విద్వాన్, హిందీ, బెనారెస్ మెట్రిక్, ఇంటర్మీడియేట్ పరీక్షలకు శిక్షణ తరగతులు, వయోజన విద్యా కార్యక్రమము.
కళాశాఖ :	సంగీతము (గాత్ర వాద్యములు), భరతనాట్యము, చిత్రలేఖనము.
రాజ్యలక్ష్మి పారిశ్రామిక విద్యాలయము :	చేతికాగితపు పరిశ్రమ, కుట్టు, లేసు పని, ఇతర గృహ పరిశ్రమలు.
మతవిషయికము :	హైందవ మత ధర్మ ప్రచారము.
క్రీడా వినోదములు : (క్లబ్బు శాఖ)	విద్యార్థినులకు, సభ్యులకు ఇన్‌డోరు, అవుట్ డోరు ఆటలకు ఏర్పాట్లు. సభ్యురాండ్ర స్నేహ సమావేశాలకు కేంద్రము.

విద్యార్థినులకు మల్లమదేవి మహిళా మందిరములో హాస్టలు సౌకర్యములు చేయబడినవి.